పరిశ్రమలకు స్వర్ణయుగం

- పెట్టుబడులకు స్నేహపూర్వక హస్తం
- ప్రపంచానికి ఆదర్శంగా టిఎస్ఐపాస్...
- 23 వేల పరిశ్రమలు... రూ.2.64 కోట్ల పెట్టుబడులు
- దశాబ్ది ఉత్సవాల్లో నేడు పారిశ్రామిక, ఐటి రంగాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేలల్లో పరిశ్రమలు... లక్షల కోట్ల పెట్టుబడులు.. లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు.. సులభ వాణిజ్యంలో నెం.1.. ఇదీ తెలంగాణ పారిశ్రామికం.. ప్రపంచం దారిపట్టిన ఎర్రతివాచీ వనం. 'పరిశ్రమలు వర్ధిల్లాలి. ఉపాధి పెరగాలి. తెలంగాణ పచ్చబడాలి' అనే ధ్యేయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు పెద్దపీటవేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ సంబంధిత వివరాలతో కూడిన ప్రకటన సోమవారం విడుదల చేశారు. ప్రపంచంలోనే నెంబర్‌వన్ పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తూ తెలంగాణను 23 వేల పరిశ్రమలకు అడ్డాగా మార్చింది. ఈ పరిశ్రమల ద్వారా 17 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా ఐటీ, ఔషధాలు, ఆహార శుద్ధి, విమానయానం తదితర రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో అనేక దేశీయ, విదేశీ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి.

టిఎస్ఐపాస్‌తో....

రాష్ట్ర ప్రభుత్వం 2015లో టిఎస్ఐపాస్ చట్టాన్ని తీసుకురావటంతో ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణ వైపు చూడడం మొదలుపెట్టాయి. పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలిగి, సులభతర అనుమతులు లభించడంతో పారిశ్రామిక రంగ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. పరిశ్రమలకు కావాల్సిన భూమిని సిద్ధం చేయడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం, స్నేహపూర్వక విధానాలు, మెరుగైన ప్రోత్సాహకాలతో తెలంగాణకు ఎదురులేకుండా పోయింది. ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా వంటి నగరాలను కాదని రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 24 గంటలు విద్యుత్తు, మెరుగైన శాంతిభద్రతలు, స్థిరమైన, సమర్థవంతమైన పరిపాలన పరిశ్రమలకు వరంగా మారాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో ఇప్పుడు తెలంగాణ గమ్యస్థానమైందని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఇండస్ట్రీయల్ పార్కులు

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ప్రభుత్వ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద సమీకృత ఔషధ క్లస్టర్‌గా దీన్ని 14,029 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. రూ.64 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 4.20 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. జహీరాబాద్‌లో మల్టీ ప్రొడక్ట్ తయారీ జోన్‌ను ప్రతిపాదించారు. 12,635 ఎకరాల్లో నిమ్జ్ పథకం కింద మొదటి దశలో 3,909 ఎకరాలను కేటాయించారు. దీని ద్వారా 2.77 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. హైదరాబాద్–నాగపూర్ ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మహేశ్వరంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లను అభివృద్ధి చేశారు. ఇందులో రావిర్యాల క్లస్టర్ 603 ఎకరాల్లో, మహేశ్వరం క్లస్టర్ 310 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఖాళ్ళా గ్రామంలో 123 ఎకరాల్లో ఏర్పాటుకు ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్‌ను ప్రతిపాదించారు. సంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చందనవల్లిలో ఇండస్ట్రీయల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇది మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రీయల్ పార్క్. 20వేల ఎకరాల్లో ప్రతిపాదించారు అత్యుత్తమ కార్పెట్ టైల్స్ తయారీ సంస్థ వెల్ స్పన్ ఫ్లోరింగ్, గ్రీన్ కార్పెట్స్, ఇప్పటికే ఇక్కడ ఉత్పత్తులు ప్రారంభించాయి. దండుమల్కాపూర్‌లో తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ (టిఐఎఫ్) భాగస్వామ్యంతో ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం 523 ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో 621 కంపెనీలకు ఇప్పటికే భూములను కేటాయించారు. సుల్తాపూర్‌లో ఎఫ్‌టిసిసిఐ లేడీస్ ఆర్గనైజేషన్‌కు 50 ఎకరాలు కేటాయించారు. ఎంఎస్‌ఎంఈల గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటునకు 26 కంపెనీలకు భూముల కేటాయించారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం సుల్తాన్ పూర్‌లో 250 ఎకరాల్లో మెడికల్ డివైజెస్ పార్క్‌ను అభివృద్ధి చేశారు.

ఐటీ రంగంలోనూ..

ఐటీ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం మేటిగా నిలిచింది. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఐటీ వార్షిక ఎగుమతుల విలువ రూ.57వేల కోట్ల నుంచి రూ.1.83 లక్షల కోట్లకు పెరిగింది. 220 శాతం వద్ధిరేటు నమోదయింది. ఐటీ ఉద్యోగాల నియామకాలలోనూ 156 శాతం వృద్ధి ఉండడం విశేషం. 2014 నాటికి తెలంగాణలో కేవలం 3.24 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉంటే, ఇప్పుడు వారి సంఖ్య 9.27లక్షల పెరిగింది. ఐటీ రంగాన్ని హైదరాబాద్ నగరానికే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలకూ విస్తరించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్ధిపేటలలో కూడా ఐటీ టవర్లను నిర్మించారు. ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణకు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అనేక అంతర్జాతీయ సదస్సులకు ఆహ్వానాలు అందుతున్నాయి. గతంలో వచ్చిన దిగ్గజ సంస్థలతోపాటు ఇంగ్లాండు, అమెరికాల నుంచి కూడా అనేక ప్రఖ్యాతిగాంచిన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. కొన్ని సంస్థలు అక్కడికక్కడే ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. వినూత్న ఆవిష్కరణలతో ముందుకువచ్చే యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు టీ-హబ్, వీ-హబ్, టి-వర్క్స్, రీచ్ సంస్థలు దోహదపడుతున్నాయి. వినూత్న స్టార్టప్‌లకు సంబంధించిన ఆవిష్కరణలతో టి-హబ్ దేశంలోనే రికార్డు సృష్టించింది. అందుకే టిహబ్-2నూ ప్రభుత్వం ప్రారంభించింది. 2022లో భారత ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ స్టార్టప్ అవార్డులల్లో టి-హబ్ ఉత్తమ ఇంక్యుబేటర్‌గా నిలిచిందని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ వివరించారు.

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

బోర్లకు మీటర్లు పెట్టం

- కేంద్రం రూ.30 వేల కోట్లు ఆపినా..
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు
- జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఆపినా.. రైతుల బోర్లకు మీటర్లు పెట్టమని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. సోమవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి ప్రారంభించి లబ్దిదారులకు అందజేశారు. అంతకుముందు పాపన్నపేటలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, పశు వైద్యశాల, లింగయ్యపల్లిలో పంచాయతీ భవనం, ఏడుపాయలలో నూతనంగా నిర్మించిన యాగశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యక్రమైన న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుడుతుందని వెల్లడించారు. అన్ని సౌకర్యాలతో ఇల్లు కట్టి ఇచ్చింది కెసిఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. ఈ నెలాఖరిలోగా ఇంటి జాగా ఉన్న వారికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు కట్టుకొనేందుకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. డబ్బులనూ నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీ

మెదక్ జిల్లా కొల్చారం మండలంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేశారు. ఏడుపాయల హరిత హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్ రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. జర్నలిస్టుల సంఘం కొల్చారం మండల అధ్యక్షులు కాశం శ్రీనివాస్, జర్నలిస్టులు పట్లోరి వెంకటేశం, నీలకంఠి రమేష్, మిద్దె లక్ష్మీనారాయణ, అప్సర్, అశోక్, అనిల్, జిఎల్ కుమార్, సంతోష్ కుమార్, యాదగిరి, లక్ష్మీనారాయణ గౌడ్, మల్లేశం, నాగరాజు గౌడ్, పెంటయ్య, గోపాల్ పాల్గొన్నారు.

11న గ్రూప్-1 ప్రిలిమ్స్ యథాతథం

- పరీక్ష వాయిదాకు హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్–1 ప్రిలిమినరీ రాతపరీక్షను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈనెల 11న యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేసింది. గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలన్న పిటిషన్లను కోర్టు సోమవారం కొట్టేసింది. టిఎస్‌పిఎస్సి ప్రశ్నాపత్రాలు లీకైన నేపథ్యంలో గతేడాది అక్టోబర్ 16వ తేదీన నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అభ్యర్థులకు మరోసారి ఈనెల 11న ప్రిలిమ్స్ నిర్వహించేందుకు టిఎస్‌పిఎస్‌సి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షకు సంబంధించి టిఎస్‌పిఎస్‌సి హాల్ టికెట్లు కూడా విడుదల చేసింది. ఈనెల 11న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుంది. 503 గ్రూప్–1 పోస్టులకు మొత్తం 3,80,202 దరఖాస్తులొచ్చాయి. అయితే ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగినా టిఎస్‌పిఎస్‌సి పాలకమండలి, సిబ్బందిలో మార్పులు చేయకుండా మళ్లీ వారితోనే పరీక్షను నిర్వహించడం సరైంది కాదంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పూర్తయ్యేంత వరకు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేయాలంటూ కోరారు. యుపిఎస్‌సి వంటి సంస్థకు పరీక్ష నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని పిటిషన్ దాఖలు చేశారు. వాటిపై హైకోర్టు న్యాయమూర్తి ఎం సుధీర్‌కుమార్ విచారణ జరిపారు. అన్ని జాగ్రత్తలతో పారదర్శకంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాటు చేసినట్టు అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,80,202 మంది పరీక్ష రాయనున్నారని, ఇప్పటికే లక్షన్నర మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 995 పరీక్షా కేంద్రాలను కూడా టిఎస్‌పిఎస్‌సి సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఇంకోవైపు ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు చురుగ్గా కొనసాగుతున్నదని వివరించారు. త్వరలోనే చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నట్టు తెలిపారు. కొంత మంది అభ్యంతరాల కోసం లక్షలాది మంది అభ్యర్థుల్లో గందరగోళం సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు గ్రూప్–1 పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లను కొట్టేసింది.

అసమానతలు పెంచుతున్న పాలకులు

- రైల్వే ప్రమాదానికి ప్రధాని బాధ్యత వహించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సామాజిక అసమానతలు పెంచేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో కెవిపిఎస్ రాష్ట్ర సామాజిక శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల కిందట అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా సామాజిక అసమానతలు పెంచుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామ్యవాదులు విశాల ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాదంపై ప్రధాని మోడీ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖలో దాదాపు రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీ ఉంటే మోడీ ప్రభుత్వం ప్రయివేటు పరం పేరుతో రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అందుకే ఈ ప్రమాదం జరిగిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజకీయాలపై దృష్టి పెట్టింది తప్ప ప్రజల రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. రైల్వే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, ఉపాధ్యక్షులు కురుమయ్య పాల్గొన్నారు.

యువతే భారత నిర్మాతలు

- సిఎం కెసిఆర్
- కోకాపేటలో భారత్ భవన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలతో ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలే పునాదులని బిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ అన్నారు. భావి భారత నిర్మాతలుగా యువతను తయారు చేసే దిశగా, దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరమున్నదన్నారు. ఇందుకోసం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాల్లో బోధన, శిక్షణ అవసరం ఉందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కోకాపేటలో భారత్ భవన్ (సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్)కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి దోహదం చేసే దిశగా నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన గొప్ప గొప్ప మేధావులను, వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారిని పిలిచి నాయకత్వ శిక్షణనిప్పిస్తామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించే నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. అందులో భాగంగానే 'పొలిటికల్ ఎక్సలెన్స్ అండ్ హెచ్ ఆర్ డీ' కేంద్రాన్ని తీర్చిదిద్దాలనే నిర్ణయం తీసుకున్నామని సిఎం వివరించారు. దేశం నలుమూలల నుంచి వచ్చే సామాజిక కార్యకర్తలకు, రాజకీయ వేత్తలకు, నాయకులకు భారత్ భవన్‌లో సమగ్రమైన సమస్త

సమాచారం లభ్యమౌతుందని చెప్పారు. శిక్షణకు అనుగుణంగా.. తరగతి గదులు, ప్రొజెక్టర్‌తో కూడిన మినీహాల్స్, విశాలమైన సమావేశ మందిరాలు, అత్యాధునిక సాంకేతికత కలిగిన డిజిటల్ లైబ్రరీలు, వసతికోసం లగ్జరీ గదులు నిర్మితమౌతాయని అన్నారు. మీడియా రంగంలో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికను అందిపుచ్చుకునే దిశగా సీనియర్ టెక్నికల్ బృందాలు కూడా పనిచేస్తాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల అధ్యయనం దిశగా, శిక్షణ సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అంతకుముందు వేద పండితులు భూ వరాహ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమాజ మార్పే లక్ష్యంగా మోరె జీవితం

- 'ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణలో మల్లేపల్లి లక్ష్మయ్య
- సామాజిక పోరాటాల ఆవశ్యకతను మోరె నొక్కి చెప్పారు : జి రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజ మార్పే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన రామచంద్ర బాబాజీ మోరె ఆదర్శ కమ్యూనిస్టు అని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. అనేక అంశాల్లో అంబేడ్కర్, మోరెకు అభిప్రాయభేదాలున్నప్పటికీ సమాజ మార్పు కోసం వారిద్దరూ కలిసి పనిచేశారనీ, అనేక అంశాల్లో వారిద్దరి మధ్య పోలికలున్నాయని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు' పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి బి.విజయభారతి ఆవిష్కరించారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఎడిటర్ కె.ఆనందాచారి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పుస్తకావిష్కరణ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ..దళితుల జీవన విధానం కమ్యూనిస్టులకు దగ్గరగా ఉంటుందని చెప్పారు. సమస్య ఎత్తిచూపటం, బలమైన ఉద్యమాలు చేయడమే కాదు..పరిష్కారం చూపే ఆలోచనా విధానం కూడా కలిగి ఉంటే బాగుంటుందన్నారు.కాలక్రమంలో అంబేడ్కర్, మోరె నేతృత్వంలో మహద్ సామాజిక పోరాటానికి దారితీసిందని చెప్పారు. విజయ భారతి మాట్లాడుతూ..మోరె జీవిత చరిత్ర ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమని నొక్కి చెప్పారు. ఆ పుస్తకం రీసెర్చ్ సోర్స్ మెటీరియల్ అన్నారు. ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి, పుస్తక అనువాదకులు ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ..బహిష్కృత భారత్‌లో సబ్ ఎడిటర్‌గా మోరె పనిచేశారని తెలిపారు.

మహిళల పట్ల నిర్లక్ష్యం

- రాజస్థాన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ పూనియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నదని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ పూనియా విమర్శించారు. మహిళల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే సీతక్క, కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ఏం సంతోషంగా ఉన్నారని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఏం తప్పు చేసిందని బంగాళాఖాతంలో కలపాలని కెసిఆర్ అంటున్నారో అర్థం కావడం లేదన్నారు. 2014లో ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళకు కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించలేదన్నారు. మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చైన్ స్నాచింగ్, సైబర్ దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు. మద్యాన్ని నియంత్రించడంలో సిఎం కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మహిళలకు కొత్త పింఛన్లు ఇవ్వలేదని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటై కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ధరణి పోర్టల్ వల్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను కెసిఆర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని కోరారు. విఆర్ఒ వ్యవస్థను తీసేసి రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించారని సీతక్క విమర్శించారు. ఒలింపిక్ గేమ్స్‌లో పతకాలు గెలిచిన క్రీడాకారులను కేంద్రం గౌరవించడం లేదని చెప్పారు.

అధికారంలోకి వచ్చాక ధరణి రద్దు : మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చెప్పారు.ధరణి తెచ్చి పెడుతున్న చిక్కులతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు రూ 10వేల నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణంలో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవితను రక్షించేందుకు సిఎం కెసిఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ఎద్దేవా చేశారు.

రెజ్లర్లకు మద్దతుగా 7న ఆందోళనలు

- 13న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత దేశానికి గోల్డ్ మెడల్స్ తీసుకొచ్చి, దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలిండియా ఫెడరేషన్ అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. రెజ్లర్లపై పోరాటంపై నిర్బంధాన్ని ఖండిస్తూ ఈ నెల ఏడో తేదీన మండల కేంద్రాల్లో నిరసనలకు, 13న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రెజ్లర్లు 40 రోజులకుపైగా జంతర్‌మంతర్ వద్ద పోరాటం చేసినా కేంద్రం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. మే 28న ఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ముందు రెజ్లర్లు మహాపంచాయతీ నిరసను పోలీసులు అత్యంత పాశవికంగా అడ్డుకోవడం, లాఠీచార్జి చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

పురపాలనలో పౌరభాగస్వామ్యం

- అప్పుడే సత్ఫలితాలు సాధ్యం
- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పురపాలనలో పౌరభాగస్వామ్యం పెరిగితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని రాష్ట్ర పురపాలక, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ సంస్థ తెలిపిందని వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారంనాడిక్కడి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్ల క్రితం హైదరాబాద్ నగరం గురించి, రాష్ట్ర భవిష్యత్తు గురించి, పాలనా దక్షత గురించి అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయనీ, కానీ నేడు రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా మారాలంటే మరింత శ్రమించాల్సి ఉందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పురపాలనలో ఆస్కీ తమతో కలిసి పనిచేస్తున్నదని, మంచి సలహాలు, సూచనలు ఇస్తోందని ప్రసంసించారు. "ఇల్లు మాత్రమే నాది. నగరం నాది కాదు" అనే బాధ్యతారాహిత్యం ప్రజల్లో ఉన్నన్ని రోజులు ఎన్ని నిధులు ఖర్చుపెట్టినా నగరం సంపూర్ణంగా మారదని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే పురపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలని, అప్పుడే మార్పు సాధ్యమవుతుందన్నారు.

'రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్' అనే ట్రిపుల్ అర్ మంత్ర ఉన్నదనీ, దాన్ని విస్తృతంగా ఆచరణలోకి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో భారీ ఎత్తున మొక్కలు నాటి, వాటిని కాపాడుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, ప్రతి గ్రామానికి ఒక నర్సరీ పెట్టి, చెట్ల పెరుగుదలకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ, పంచాయతీరాజ్ చట్టంలో గ్రీన్ బడ్జెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయలు అందుబాటులోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధించడం సాధ్యమవుతుందని వివరించారు. డ్రై రిసోర్సెస్ సెంటర్ల ద్వారా మహిళా సంఘాలు గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందుతున్నాయనీ, రాష్ట్రంలో ఈ సెంటర్ల ద్వారా రూ.6 కోట్లకు పైగా ఆదాయాన్ని స్వయం సహాయక సంఘాలు అర్జించాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉత్పత్తి అయ్యే వెట్ వేస్ట్ ద్వారా దాదాపు రూ.200 కోట్లకు పైగా ఆదాయం వస్తోందని చెప్పారు. నగరం పెరుగుతున్న కొద్దీ చెత్త సేకరణతో పాటు దాన్ని రీసైకిల్ చేసే వ్యవస్థలు మరింత పెరగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరంలో మరో రెండు కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసైకిల్ ప్లాంట్లను నెలకొల్పనున్నట్టు తెలిపారు. పురపాలికల్లో చెత్త నుంచి గ్యాస్ వెలికితీసి వంటకి, వాహనాలకు ఉపయోగించే కార్యక్రమాలను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. 141 పురపాలికల్లో 178 కోట్ల రూపాయలతో బయో మైనింగ్ ప్రారంభించామని, మానవ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వందశాతం వృధా నీటిని రీసైకిల్ చేస్తున్న నగరంగా త్వరలో హైదరాబాద్ నిలుస్తోందన్నారు. సోలార్ ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆస్కీ చైర్మెన్ కె పద్మనాభయ్య, డైరెక్టర్ వి శ్రీనివాసచారి, సిడిఎంఎ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

- సిఎండి ఎన్ శ్రీధర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ సంస్థ గడచిన 9 ఏండ్లలో అద్భుత ప్రగతి సాధించిందనీ, అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చే ఐదేండ్ల లక్ష్యాలను నిర్ధారించుకున్నామని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. వచ్చే ఐదేండ్లలో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి. 8 కొత్త గనులు ప్రారంభించి రూ. 50 వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ సింగరేణిభవన్‌లో సోమవారం సింగరేణి ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. తెలంగాణ అమరవీరులు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు. ఇతర రాష్ట్రాల్లోకీ సంస్థ విస్తరిస్తున్నదని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బ్లాక్ నుంచి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తున్నామనీ, వచ్చే ఏడాది నుంచి 10 మిలియన్ టన్నుల బొగ్గును అక్కడ ఉత్పత్తి చేస్తామన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పటికే 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్నీ, 224 మెగావాట్ల సోలార్ విద్యుత్తును కూడా రాష్ట్ర అవసరాలకు అందిస్తున్నామన్నారు.

బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

- రెజ్లర్లకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శవయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి ఎంపి, డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సోమవారం ఆయన్ను కఠినంగా శిక్షించాలంటూ పెద్దఎత్తున నినాదాలతో శవయాత్రను

నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ.. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం సిగ్గుచేటని విమర్శించారు. అగౌరవపరుస్తున్నారంటూ ప్రధాని మోడీకి రెండేండ్ల క్రితమే క్రీడాకారులు విన్నపించుకున్నా కనీసం చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు బ్రిజ్‌భూషన్ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ కోరినా, క్రీడాకారులకు రక్షణ కల్పించాలంటూ విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కొన్ని నెలలుగా ఢిల్లీ సరిహద్దుల్లో రెజ్లర్లు పోరాటం చేస్తుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతున్నదని విమర్శించారు. భేటీ బచావో భేటీ పడావో అంటే మహిళలకు కనీసం రక్షణ కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడమేనా? అని ప్రశ్నించారు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తారా సింగ్, భరత్, వెంకటేష్, ఆది, సతీష్, లెనిన్, రమేష్, రమ్య, నాయకులు కవిత, పవిత్ర, రమాదేవి, మమత, రోహిత్, స్టాలిన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పరీక్షను రద్దుచేయాలి

- కనీస వేతనంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి
- ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లకు కొత్తగా పరీక్ష పెట్టి అర్హత సాధిస్తేనే వారిని కొనసాగిస్తామని ప్రభుత్వం కొత్తగా నిబంధన పెట్టడాన్ని నిరసిస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల నోడల్ ఆఫీసర్లు, వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్లు, మాన్యం చల్క, లైన్ వాడ, రాములబండ పిహెచ్‌సిల ఎదుట ధర్నాలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు, ఆశా నోడల్ ఆఫీసర్లకు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైద్యులు సయ్యద్ ఇక్బాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మునుగోడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. దామరచర్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అర్బన్ హెల్త్ సూపరింటెండెంట్‌కు, బొల్లపల్లిలోని పిహెచ్‌సి వైద్యునికి వినతిపత్రాలు అందజేశారు. భూదాన్‌పోచంపల్లిలోని పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు.

కొమరం భీమ్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సీహెచ్‌సీ, నజ్రుల్‌నగర్ పిహెచ్‌సిల ముందు ఆశా వర్కర్లు ధర్నా చేపట్టి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం, వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. కౌటాలలో పిహెచ్‌సిల ఎదుట ధర్నా చేపట్టారు. ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ధర్నా నిర్వహించి వైద్యాధికారి కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి విక్టోరియాకు ఆశా కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు ధర్నా చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సీహెచ్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, అశ్వాపురం, పాల్వంచ మండలాల్లో సిఐటియు ఆధ్వర్యంలో మండల వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. చర్లలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించని యెడల ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించిన ఆశా కార్యకర్తలు.. అనంతరం డాక్టర్ మానసికి వినతిపత్రాన్ని అందజేశారు. తాడూరు మండల కేంద్రంలోని పీహెచ్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడం పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. కొత్తకోట మదనపురంలో ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించి డాక్టర్ భవాని రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

రాష్ట్రంలో 850 ప్రాంతాల్లో జియో 5జి సేవలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని 850 ప్రాంతాల్లో 5జి సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు రిలయన్స్ జియో వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో జియో ట్రూ 5జి సేవలను విస్తరించినట్లు తెలిపింది. ఆయా ప్రాంతాల్లో వెల్‌కమ్ ఆఫర్ కింద 1 జిబిపిఎస్ వేగంతో అపరిమిత డేటాను ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా 850 ప్రాంతాల్లో జియో ట్రూ 5జి సేవలను అందిస్తున్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నామని రిలయన్స్ జియో తెలంగాణ సిఇఒ కెసి రెడ్డి పేర్కొన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీ పర్లపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా పర్లపల్లి ఎంపికైంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ పంచాయతీకి అవార్డు అందచేశారు. ప్లాస్టిక్ ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనం విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయితీ అవార్డు కు ఎంపికైంది. సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలిలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు అల్లోళ్ల ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా పర్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి మాదాడి భారతినర్సింహారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పిల్లలుంటేనే బడి ఉంటుంది. ప్రభుత్వ బడులను కాపాడుకుందాం' అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. 2023-24 విద్యాసంవత్సరం సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల మూడో తేదీ నుంచి బడిబాట ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చేందుకు ఇతోధిక కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నమోదు తగ్గుతున్నదని పేర్కొన్నారు. 21వ శతాబ్ద ప్రారంభం నుంచి తల్లిదండ్రుల్లో వారి పిల్లలను ఇంగ్లీష్ మాధ్యమంలో చదివించాలనే కోరిక పెరుగుతూ వస్తున్నదని తెలిపారు. దీంతో తెలుగు మాధ్యమంలో విద్యార్థుల నమోదు తగ్గుతున్నదని వివరించారు. గత విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. అయినా విద్యార్థులు ఇబ్బడిముబ్బడిగా చేరుతారని భావించలేమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. ప్రతి బడికి పాఠశాల విద్యాశాఖ నుంచే సర్వీసు పర్సన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేస్తే బడుల్లో విద్యార్థుల సంఖ్య కొంత మేరకు పెంచొచ్చని పేర్కొన్నారు. గత రెండేండ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగిన పాఠశాలలున్నాయని వివరించారు.

డిప్యూటీ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న నాయకులు

21 తర్వాత సమ్మె

- గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్టీపర్పస్ రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్, జీవో నెంబర్ 60 అమలు, తదితదిర డిమాండ్లను నెరవేర్చాలనీ, లేని పక్షంలో ఈ నెల 21 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి రాష్ట్ర సర్కారుకు అల్టిమేటం జారీ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ రామారావుకు జెఎసి ఆధ్వర్యంలో 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ ఎన్.యజ్ఞనారాయణ, కోశాధికారి సీహెచ్ సదానందం, కన్వీనర్లు చాగంటి వెంకటయ్య, పి.అరుణ్‌కుమార్, పి.శివబాబు, జయచంద్ర, కోకన్వీనర్లు వెంకటరాజ్యం, ఆర్.మధుసూదన్‌రెడ్డి, పాలడుగు సుధాకర్, ఆర్‌కే.నాయుడు, జెఎసి సభ్యులు సామల శ్రీకాంత్, వెంకట్రాములు, డి.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలని కోరారు. పిఆర్‌సిలో కనీస వేతనంగా నిర్ణయించిన రూ.19 వేలను తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేషన్ కల్పించాలనీ, వారిని సహాయ కార్యదర్శులుగా నియమించాలనీ, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌కేడే ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనీ, అవసరమున్న చోట సిబ్బందిని కొత్త నియమించాలనీ కోరారు. పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, యూనిఫామ్స్, అలవెన్స్‌లు, తదితర సౌకర్యాలను వర్తింపజేయాలని విన్నవించారు. ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలనీ, దహనసంస్కారాలకు ప్రత్యేకంగా డబ్బులు ఇవ్వాలని కోరారు.

సింగరేణి థర్మల్‌కు పర్యావరణ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ)లో చేపట్టిన పర్యావరణహిత చర్యలకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారంనాడిక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ అవార్డును సింగరేణి యాజమాన్యానికి అందచేశారు. ఎస్‌టీపీపీలో చేపట్టిన కాలుష్య నివారణ, నీటి, ఇంధన పొదుపు చర్యలు, వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం పెంపునకు చేస్తున్న కృషిని గుర్తిస్తూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. మంత్రుల చేతులమీదుగా ఎస్‌టీపీపీ చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథ రాజు ఈ అవార్డును అందుకున్నారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత వస్తువుల ప్రదర్శనను మంత్రులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకుంటున్న వివిధ శాఖల అధికారులు, సంస్థలు, విద్యార్థులకు ప్రోత్సహకాలు, బహుమతులు అందజేశారు.

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు

- ఎమ్మెల్సీ కె కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలకు వ్యతిరేకంగా అనేక మంది ప్రయత్నాలు చేసినా, సిఎం కెసిఆర్ పట్టుబట్టి వారసత్వ ఉద్యోగాలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంబరాలు జరుపుకుంటున్న బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. సంస్థలో ఇప్పటివరకు దాదాపు 15 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చినట్టు చెప్పారు. పురుషులకే కాకుండా, కూతుళ్లు, కోడళ్లకు సైతం అవకాశం ఇవ్వడం ద్వారా మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపితమైందన్నారు. ఈ సందర్భంగా సంస్థలో అమలవుతున్న పలు కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ఆమె ప్రస్తావించారు.

రాజ్యాంగ సంస్కృతి ప్రజలకు చేరవేసే సాహిత్యం రావాలి

- సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ

ప్రజాశక్తి - కల్చరల్

నేటి సాహిత్యం రాశిలో మిన్నగా వాసిలో చిన్నగా అయిపోతోందని, నాటి సాహిత్యం ప్రజలకు ప్రేరణ సందేశం అందించేదిగా ఉండేదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ అన్నారు. రాజ్యాంగ సంస్కృతిని ప్రజలకు చేరువ చేసే విధంగా సాహిత్య రావాల్సిన అవసరం ఉందని ఇనాక్ ఆ దిశగా అంబెద్కర్ అణగారిన వర్గాలకు కల్పించిన హక్కులపై అవగాహన కలిగించే సాహితీ సేద్యం చేస్తున్నారని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ జీవన సాఫల్య పురస్కారం స్వర్ణ కంకణ ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిధిగా జస్టిస్ రమణ స్వర్ణ కంకణం ఇనాక్ ముంజేతికి ధారణ చేయగా, సమైఖ్య ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు ప్రశంసా పత్రం, పూర్వ మంత్రి మండలి బుధ ప్రసాద్ శాలువా మాలలతో సత్కరించారు. అనంతరం జస్టిస్ రమణ మాట్లాడుతూ పేద అణగారిన కుటుంబం నుంచి కన్నీళ్లు, తిరస్కారాలు, వివక్షతల మధ్య తల్లి ప్రేమ ప్రేరణతో ఉన్నత స్థాయికిఎదిగిన ఇనాక్ సాహిత్యం నిత్య సంఘర్షన, సాంఘీక ఆర్థిక అసమానతలపై సంధించిన అస్త్రాలని అభినందించారు. ఇనాక్ చెప్పుకోనట్లుగానే ఆయన అక్షరాలే ఆయన అశ్రువులు అని అభివర్ణించారు. తెలుగు గ్రంధీకం నుంచి వ్యావహారిక భాషగా మార్పు చెందుతున్న తరుణంలో ఇనాక్ సాహిత్య సృష్టి జరిగిందని గుర్తు చేశారు అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ ఇనాక్ ఎస్‌వి విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుని గా సామర్థ వంతంగా పనిచేశారని గుర్తు చేశారు. ఒక సాహితీ మూర్తికి స్వర్ణ కంకణ బహూకరణ అరుదు అని అట్టి అరుదైన కార్యక్రమం చేపట్టినసారిపల్లి కొండలరావు సహృదయత తెలుపుతోందని కొనియాడారు సారిపల్లి కొండలరావు సభను ప్రారంభించగా కాకి మాధవ రావు, వోలేటి పార్వతీశం, బుద్ధ ప్రసాద్ లు ఇనాక్ ప్రతిభను వివరించారు లంక లక్ష్మీ నారాయణ స్వాగతం పలికిన కార్యక్రమానికి తొలుత మిత్ర, సురేఖ,వినోద్ బాబు తదితరులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

తెలంగాణ తొలి తరం సాహితీ కళాకారుడు చందాల కేశవదాసు

ప్రజాశక్తి - కల్చరల్

కొత్తగూడెం ప్రాంతంలోని పల్లెలోపుట్టిన చందాల కేశవ దాసు తెలుగు నాట సాహితీ సినీ నాటక రంగాల్లో ఎదిగిన తొలి తరం కళాకారుడని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి దేవీ ప్రసాద్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గానసభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా చందాల కేశవ దాసు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవీ ప్రసాద్ మాట్లాడుతూ కేశవ దాస్ నాటక కర్తగా నటుడుగా కవిగానే కాక తెలంగాణ నైజాంకు వ్యతిరేకంగా పోరాట యోధుడుగా సంస్కరణ ఉద్యమ శీలిగా పెరు పొందినా ఆయన ప్రతిభకు రావలసిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీ వేత్త తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ పౌరాణిక నాటకాలకు పరాబ్రహ్మ పరమాత్మ ప్రారంభ ప్రార్ధన గీతం కేశవ దాసు రసిందేనన్నారు. తెలుగు సినిమా తొలి పాటల రచయిత కేశవ దాసు కనక తార నాటకం నాటి సామాజిక నేపథ్యంను ప్రతిబింబిస్తుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో రాష్ట్ర వికలాంగుల సంస్థ జాతీయ నాయకుడు కొల్లి నాగేశ్వరరావు పాల్గొనగా చక్రపాణి వందన సమర్పణ చేశారు.

పదేళ్లుగా అటవీ అనుమతులు పెండింగ్

- అమలుకాని ప్రధాని సడక్ యోజన
- రోడ్లు వేయకుండా కేంద్రం అడ్డగింత
- ఎనిమిది జిల్లాల్లో అవస్థలు
- అమీతుమీకి పిఆర్ ఇంజినీరింగ్ శాఖ సన్నద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారవాణకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నది. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో రోడ్లు వేయడానికి ఆటంకాలు సృష్టిస్తున్నది. చట్టాల అమలు పేరుతో ఆయా జిల్లాల్లోని స్థానిక ప్రజలు, గిరిజనులను ముండ్లబాటలో నడిపిస్తున్నది. రవాణా సౌకర్యాన్ని దూరం చేస్తున్నది. మార్గదర్శకాలను పాటించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, వాటి అమలు పేరుతో ఏండ్ల తరబడి అనుమతులు జాప్యం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానమంత్రి సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. కన్వర్జేషన్ ఆఫ్ ఫారెస్ట్ యాక్ట్, వైల్డ్ లైఫ్ యాక్ట్ పేరుతో కేంద్ర అటవీ శాఖ కొర్రీలపై కొర్రీలు వేస్తూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మించే అవకాశం లేకుండా చేస్తున్నది. పైపెచ్చు ఉమ్మడి రాష్ట్రంలో 'మా అనుమతి లేకుండా మట్టిరోడ్లు, బ్రిడ్జిలు కట్టారంటూ కేసులు పెడతామని బెదిరిస్తున్నది. దీనిపై రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ యంత్రాంగం తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. ఇక అమీతుమీ తేల్చుకోవడానికి సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రత్యేక నివేదిక తయారుచేసే పనిలో నిమగ్నమైంది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించాక కేంద్ర అటవీ శాఖతో సంప్రదింపులు చేయడం ద్వారా సమస్యను వీలైనంత వేగంగా పరిష్కరించేందుకు రంగం సిద్ధంచేస్తున్నట్టు వినికిడి.

కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లల్లో రాష్ట్రానికి ప్రధానమంత్రి సడక్ యెజన(పిఎంజీఎస్‌వై) కింద మూడు సార్లు రోడ్లు మంజూరు చేసింది. ఎనిమిది జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ శాఖ సంబంధిత పీఎంజీఎస్‌వై రోడ్లను నిర్మించడానికి ఏండ్ల తరబడి ప్రయత్నాలు చేస్తున్నది. పీఎంజీఎస్‌వై-1, పీఎంజీఎస్‌వై-2, పీఎంజీఎస్‌వై-3 ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఇందులో పీఎంజీఎస్‌వై-2 రోడ్ల నిర్మాణం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తయ్యాయి. మిగతా రెండు ప్రాజెక్టులకు సంబంధించి మాత్రం తీవ్ర ఆలస్యమవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచే ఈ మేరకు కొంత కసరత్తు జరుగుతున్నా, ఇంకా సాగదీస్తూనే ఉండటం గమనార్హం. కేంద్ర అటవీ శాఖ మాత్రం నిబంధనల పేరుతో ఎటూతేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నది. చట్టాన్ని గౌరవించాల్సి ఉన్నా, చర్చించకుండా సాకులు చెబుతూ ఆలస్యం చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఎనిమిది జిల్లాల్లోని 44 రోడ్లు ఏండ్లతరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ యాక్ట్ కిందకు వచ్చేవి 18 రోడ్లు కాగా, వైల్డ్ లైఫ్ యాక్ట్ కిందకు వచ్చేవి మరో 26 ఉన్నాయి. సుమారు 138 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించకుండా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖను నిలువరిస్తున్నది.

రిజర్వ్ ఫారెస్ట్‌ను కాపాడాల్సిందే. అడవుల్లో జంతుజాతి జీవనానికి ఆటంకం కలగకుండా చూడాల్సిందే. పర్యావరణ సమతుల్యతను సంరక్షించాల్సిందే. అయితే చట్టం అమలు చేసే సాకుతో రోడ్లు వేయకుండా ఆలస్యం చేయడాన్ని ఉన్నతాధికారులు తప్పుబడుతున్నారు.

ఎనిమిది జిల్లాల్లో..

రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రోడ్ల నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. మార్గదర్శకాల పేరుతో పీఎంజీఎస్‌వై-1, పీఎంజీఎస్‌వై-3 ప్రాజెక్టులను అమలు కాకుండా ఇబ్బంది పెడుతున్నది. ఈ మేరకు పలుమార్లు కేంద్ర అటవీ శాఖకు పీఆర్ ఇంజినీరింగ్ శాఖ లేఖలు రాసినా ప్రయోజనం ఉండటం లేదు. పైగా సంబంధిత శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకే అల్టీమేటమ్ ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. 2012 ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు వేసిన రోడ్ల నిర్మాణాలను కేంద్ర అటవీ శాఖ తప్పుపడుతున్నట్టు సమాచారం. ఆయా జిల్లాల్లోని మారుమూల గిరిజన, ఇతర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కత్తిమీద సాముగా మారింది. దాదాపు 138 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం కోసం దాదాపు పది సంవత్సరాలుగా ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. అయితే స్థానిక ప్రజలు, గిరిజనులతోపాటు ప్రజాప్రతినిధుల నుంచి త్వరితగతిన రోడ్ల నిర్మాణం చేపట్టాలంటూ ఇంజినీరింగ్ శాఖ ఒత్తిడి చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది సాధారణ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం ఉన్నతాధికారులపై పదే పదే కలుస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు అటు కేంద్రం నుంచి, ఇటు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, ఒత్తిళ్లను తట్టుకోవడం ఒకింత కష్టంగా ఉన్నట్టు సమాచారం. దీనిపై రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ సైతం కేంద్ర అటవీశాఖతో సంప్రదింపులు చేశారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కారానికి పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు నడుం బిగించారు. ఈనెల ఐదున కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి శైలేంద్రకుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన సడక్ యోజన అమలుపై చర్చించనున్నారు. ఇందులోనే పీఎంజీఎస్‌వై రోడ్ల నిర్మాణానికి పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావంతో పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్టు తెలిసింది.

డికె... ఓకే..!

- తెలంగాణపై ఫోకస్
- బిజెపి, బిఆర్ఎస్ ఎత్తులకుపై ఎత్తులు
- అన్ని తానై వ్యవహరించాలంటూ అధిష్టానం ఆదేశం
- అధికారమే లక్ష్యంగా పక్కా ప్రణాళిక
- ప్రియాంకగాంధీ నేతృత్వంలో సభలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గత రెండు ఎన్నికల్లో స్వయం కృతాపరాధంతో ఓటమిపాలైన కాంగ్రెస్ పార్టీ ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకు పోవాలని నిర్ణయించింది. అందుకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని భావిస్తున్నది. ఈసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఎట్టి పరిస్థితుల్లో చేజారకుండా జాగ్రత్త పడాలని నిర్ణయిస్తున్నది. ఇందులో భాగంగా బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలకు చెక్ పెట్టేందుకు ద్విముఖ వ్యూహాన్ని రచిస్తున్నది. కర్ణాటక ఎన్నికల్లో పార్టీ అనుసరించిన కీలకమైన అంశాలను ఇక్కడ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది. అధికారమే లక్ష్యంగా పక్క ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూనే...బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కదలికలను గమనిస్తూ...వాటికి చెక్ పెట్టడం వంటి పనులు ఏకకాలంలో చేయాలని భావిస్తున్నది. ఈ క్రమంలో కర్ణాటక ఎన్నికల్లో ట్రబుల్ షుటర్‌గా పేరొందిన ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను తెలంగాణ ఎన్నికల రణరంగంలోకి దించాలని అధిష్టానం భావిస్తున్నది. అందుకు ఆయనే సరైన నేతగా అధిష్టానం గుర్తించినట్టు సమాచారం. బిజెపి, బిఆర్ఎస్‌లకు సమాన దూరంగా ఉంటూనే, వాటిని మట్టి కరిపించేందుకు ధీటైన నేతగా ఆయన్ను ఎంపిక చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముందుగా బిజెపి అంతర్గత కలహాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఇప్పటికే ఆయన రంగంలోకి దిగినట్టు వినికిడి. ఇతర పార్టీల నుంచి ఎవరైనా సరే బిజెపిలో చేరకుండా అడ్డుకట్టవేడయంతోపాటు విధిలేని పరిస్థితుల్లో కమలం కండువా కప్పుకున్న వారిని సైతం హస్తం గూటికి రప్పించేందుకు ఆయన ప్లాన్ చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను కాంగ్రెస్ ప్రధాన శత్రువుగా ఎంచుకుంది. ఆ పార్టీ ఎత్తుగడలకు పైఎత్తులు వేయడం ద్వారా కారుకు బ్రేకులు వేసేందుకు డీకే కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎన్నికలకు ఆయన్ను సమన్వయకర్తగా నియమించనున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ఉండటం, అన్ని తానై వ్యవహరించాలంటూ ఆయనకు ఇప్పటికే ఏఐసిసి ఆదేశించినట్టు గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. అందులో భాగంగానే డీకే వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిలతో చర్చలు జరిపారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ పరిణామాల వెనుక డీకే చక్రం తిప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. డీకేను రంగంలోకి దించడం వెనుక కర్ణాటక ఎన్నికల ఫలితాలు ఒక కారణమైతే, సామాజిక తరగతుల వారీగా ఓటింగ్‌ను కాంగ్రెస్ వైపు తిప్పడంతో ఆయన అక్కడ కీలక పోషించడం మరో కారణం. తెలంగాణ కాంగ్రెస్‌లో బలమైన గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలు, తగాదాలు ఎక్కువే. వాటన్నింటిని ఓ దారికి తీసుకొచ్చేందుకు డీకేను ప్రయోగించాలని భావిస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల బలబలాలు బేరీజు వేయడం, గెలిచే అవకాశాలున్న నేతలకు టికెట్లు ఇవ్వడంతోపాటు అన్ని రకాల సహయ, సహకారాలు అందించేందుకు ఆయనకు పూర్తి అధికారాలు కట్టబెట్టేలా ఏఐసిసి కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంపై రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సైతం దృష్టి సారించారు. అమెరికా న్యూజెర్సీలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్‌గాంధీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో యూత్ డిక్లరేషన్ విడుదల చేసిన ప్రియాంకగాంధీ...జూన్ చివరి వారంలో మరోసారి ఖమ్మం సభకు రానున్నారు. తద్వారా బిఆర్ఎస్ హామీలకు దీటుగా కాంగ్రెస్ హామీలు ఇచ్చేందుకు కరసత్తు చేస్తున్నది. ఇప్పటికే యూత్ డిక్లరేషన్ కొంతమేరకు ప్రభావాన్ని చూపిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత మహిళా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ డిక్లరేషన్లు విడుదల చేయనుంది. రానున్న ఎన్నికల్లో వాటినే ఎన్నికల హామీలుగా ప్రచారం చేయాలని భావిస్తున్నది.